సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 24 । నవంబర్ । 2023



మహిమాన్వితం.. శక్తిపీఠ క్షేత్రం
కొండపాక శివారులోని ఆనంద నిలయం ఆవరణలో నిర్మించిన అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. వివరాలు IIలో ▸



వర్షం..'ఆట'ంకం
వర్గల్ పూలే గురుకులంలో రాష్ట్ర బాలికల ఆటల పోటీలకు వర్షం ఆటంకంగా నిలిచింది. గురువారం రెండోరోజు మార్నింగ్ సెషన్‌కే పోటీలు పరిమితమయ్యాయి. వివరాలు IIలో ▸



భారీ మెజార్టీయే లక్ష్యం
హరీశ్‌రావుకు భారీ మెజార్టీ ఖాయమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం కొండంరాజ్‌పల్లి, ఖాత గ్రామాల్లో మంత్రికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

నేడు ప్రియాంక గాంధీ రాక



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తదితరులు

హుస్నాబాద్: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ శుక్రవారం హుస్నాబాద్‌కు రానున్నారు. పట్టణంలోని అమరుల స్థూపం వద్ద బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి పెద్ద ఎత్తున జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రియాంక గాంధీ సభాస్థలి వద్దకు చేరుకుంటారు. సభాస్థలి సమీపంలోనే హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలు, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రియాంక గాంధీ ప్రజలకు వివరిస్తారన్నారు.

కేంద్ర మాజీ మంత్రి పరిశీలన

ప్రియాంక గాంధీ పాల్గొనే సభ ఏర్పాట్లను కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

సమస్యలపై నిలదీయండి



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న పౌరహక్కుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు

హుస్నాబాద్: ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులను సమస్యలపై నిలదీయాలని పౌర హక్కుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం కరపత్రాలను, ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార స్వామి మాట్లాడుతూ తెలంగాణ ఆకాంక్షలను వదిలి నియంతృత్వం, నిర్బంధ విధానాలను అవలంబిస్తున్నారన్నారు. గౌరవెల్లి, మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల కోసం బలవంతపు భూ సేకరణ చేశారన్నారు. లక్షల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, పిల్లర్లు కుంగడం, పగుళ్లతో పంపుహౌస్‌లు మునిగిపోయాయని తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో అవినీతి, గ్రూప్స్ పేపర్లు లీకులతో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దేశంలో ఎన్ఐఏ దర్యాప్తు సంస్థను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఉపా చట్టాన్ని రద్దు చేసి, ఎన్ఐఏ సంస్థను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్, సహాయ కార్యదర్శి సంజీవ్, విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ రాజయ్య, ప్రజా సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

నాచగిరిలో వ్రతసందడి




నాచగిరిలో వ్రతమాచరిస్తున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి పుణ్యక్షేత్రంలో గురువారం సత్యనారాయణవ్రతాల సందడి నెలకొన్నది. కార్తీక శుద్ధ ఏకాదశి రోజు విశేషంగా భావిస్తూ భక్తులు క్షేత్రం సందర్శించి నదీస్నానమాచరించారు. దంపతులు సత్యనారాయణ వ్రతం చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. క్షేత్రంలో 50 వ్రతాలు జరిగినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సమస్యలపై పోరాడేది సీపీఎం మాత్రమే

రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు



మాట్లాడుతున్న రాములు

చేర్యాల(సిద్దిపేట): నిత్యం ప్రజాసమస్యలపై పోరాడేది సీపీఎం మాత్రమేనని, జనగామ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి మోకు కనకారెడ్డికే ప్రజలు మద్దతు తెలపాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శశిధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తుల కొమ్ముకాసే బీజేపీని, పదేళ్ల పాలనలో ఏ ఒక్క వాగ్దానం నెరవేర్చని బీఆర్ఎస్ పార్టీలను ఓడించి పిలుపునిచ్చారు. సమావేశంలో మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అగ్రనేతల జోరు.. ప్రచార హోరు

అగ్రనేతల రాకతో గజ్వేల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం మరింత హీటెక్కింది. సీఎం కేసీఆర్ తరఫున బీఆర్ఎస్ నేతలు ఇప్పటికే అభివృద్ధి మంత్రంతో విస్తృత ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఈనెల 28న గజ్వేల్‌లో కేసీఆర్‌తో బహిరంగ సభకు సన్నద్ధం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సైతం స్పీడ్ పెంచారు. ఈ నెల 26న మనోహరాబాద్ మండలం బ్రాహ్మణపల్లిలో జరిగే బహిరంగ సభకు ప్రధాని మోదీ రానున్నారు. గజ్వేల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సభకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరై కార్యకర్తల్లో జోష్ నింపారు. మూడు ప్రధాన పార్టీలోనూ కోలాహలం నెలకొనడంతో రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

- బీఆర్ఎస్ నేతల విస్తృత పర్యటనలు
- అభివృద్ధి, సంక్షేమ మంత్రంతో దూకుడు
- స్పీడ్ పెంచిన బీజేపీ అభ్యర్థి ఈటల
- 26న బ్రాహ్మణపల్లికి ప్రధాని మోదీ రాక
- కాంగ్రెస్ సభలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి
- మూడు ప్రధాన పార్టీల్లోనూ కోలాహలం
- గజ్వేల్‌లో రాజకీయాలు రసవత్తరం



గజ్వేల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయాలు రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతున్నాయి. నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్ అభివృద్ధి మంత్రంతో ముందుకుసాగుతున్నారు. గతనెల 20న మేడ్చల్ జిల్లా అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో భేటీ అయిన కేసీఆర్ ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి తానూ రాష్ట్రమంతా పర్యటించాల్సిన అవసరమున్నందున, తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మీదే అంటూ కోరారు. దీని తర్వాత ఈనెల 9న నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా రెండోసారి పార్టీ శ్రేణలను కలిసి అభివాదం చేశారు. అనంతరం కామారెడ్డికి వెళ్లారు. ఈ నియోజకవర్గ ఎన్నికల బాధ్యతలు చూస్తున్న మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. నిత్యం నియోజకవర్గంలో 15కుపైగా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూనే, నియోజకవర్గ శ్రేణులతో సమన్వయం చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో ప్రచారంలో చివరి రోజైన ఈనెల 28న గజ్వేల్‌లో కేసీఆర్‌తో భారీ బహిరంగ సభ నిర్వహణకు బీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బహిరంగ సభతో మరింత ఊపు రానున్నదని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. గజ్వేల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధికి తలమానికంగా తీర్చిదిద్దిన తీరు, సంక్షేమ పథకాల అమలు తమకు భారీ మెజారిటీ తెచ్చిపెడుతోందనే ధీమాలో బీఆర్ఎస్ నేతలున్నారు.

ఈటల దూకుడు..

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సైతం ప్రచారానికి పదును పెట్టారు. ఈనెల 7న నామినేషన్ దాఖలు సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇక్కడ పర్యటించారు. ఇదే క్రమంలోనే ఈనెల 26న నియోజకవర్గంలోని మనోహరాబాద్ మండలం బ్రాహ్మణపల్లిలో నిర్వహించే ప్రధాని మోదీ బహిరంగ సభపై ఈటల భారీగా ఆశలు పెట్టుకున్నారు. మోదీ సభతో పార్టీకి నియోజకవర్గంలో మరింత ఊపు రానుందని భావిస్తున్నారు. బీసీ కార్డు వాడుతూ ఈటల రాజేందర్ ప్రచారం చేస్తున్నారు. అంతేకాకుండా నిర్వాసితుల సమస్యలపై గొంతెత్తుతున్నారు. బీఆర్ఎస్‌లో అసంతృప్తులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు. అభివృద్ధి పేరిట గ్రామాల్లో పెద్ద ఎత్తున భూములు లాక్కొని రైతులకు సరైన పరిహారం ఇవ్వని అంశాన్ని కూడా నిలదీస్తున్నారు. మొత్తానికి మూడు ప్రధాన పార్టీల ప్రచార హోరుతో నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి.

తూంకుంట సైతం..

కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి సైతం పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 22న పట్టణంలోని ఐఓసీ సమీపంలోని మైదానంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిచే బహిరంగ సభను నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీలపై తనదైన శైలిలో విమర్శలు చేస్తూ ప్రచారం చేస్తున్నారు.

లక్ష ఎకరాలకు కాళేశ్వరం జలాలు

- సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టుల ద్వారా సాగునీరు
- పటాన్‌చెరులో ఐటీ పార్క్ ఏర్పాటు
- ఇస్నాపూర్ వరకు మెట్రో
- కాలుష్య రహిత పరిశ్రమలకు కృషి
- మాణిక్‌రావు, మహిపాల్‌రెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించండి
- జహీరాబాద్, పటాన్‌చెరు ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్



జహీరాబాద్‌లో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

జహీరాబాద్/పటాన్‌చెరు: కాళేశ్వరాన్ని సింగూరుతో లింకు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. సింగూరు బ్యాక్ వాటర్ నుంచి జహీరాబాద్ సంగమేశ్వర లిఫ్ట్ ద్వారా, నారాయణఖేడ్ ప్రాంతానికి బసవేశ్వర లిఫ్ట్ ద్వారా సాగునీటిని అందించనున్నామని తెలిపారు. గురువారం జహీరాబాద్, సంగారెడ్డిలో జరిగిన ఆశీర్వాద సభల్లో ఆయన ప్రసంగించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లోని నారింజ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

వికారాబాద్‌లో చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతుందా?

కాంగ్రెస్‌కు స్థానికంగా లీడర్లు లేకపోవడంతో వికారాబాద్ నుంచి దిగుమతి చేసుకొని అభ్యర్థిని పెట్టిందని కేసీఆర్ ఎద్దేవా చేశారు. వికారాబాద్‌లో చెల్లని రూపాయి జహీరాబాద్‌లో ఎలా చెల్లుతుందన్నారు. మన లోకల్ లీడర్ మాణిక్‌రావు కావాలా, వికారాబాద్ ఆయన కావాలా అనేది జహీరాబాద్ ప్రజల ఆత్మగౌరవ పరీక్ష అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు సౌమ్యుడు అని, అభ్యర్థుల గుణగణాలను, వారి వెనుక ఉన్న పార్టీల గత చరిత్రను చూసి ఓటేయాలన్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్ కావాలంటే మాణిక్‌రావును గెలిపించాలని కోరారు. మాణిక్‌రావు సౌమ్యుడు, ఉత్తముడు, చదువుకున్నవాడు, ఎవరికి నష్టపెట్టడు పేర్కొన్నారు.

ప్రజల మనిషి మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు అభ్యర్థి మహిపాల్‌రెడ్డి ప్రజల మనిషి అని, పొద్దున లేస్తే ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటాడని సీఎం కేసీఆర్ అన్నారు. పటాన్‌చెరులో కాలుష్యం ఎక్కువగా ఉందని, అందుకే రానున్న రోజుల్లో కాలుష్య రహిత పరిశ్రమలను నెలకొల్పడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పటాన్‌చెరులో ఐటీ పార్క్ ఏర్పాటు చేయనున్నామని, ఐటీ పరిశ్రమలు కూడా వస్తాయన్నారు. ఔటర్ రింగ్ రోడ్డుకి మెట్రో తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.



జహీరాబాద్ సభకు హాజరైన జనం

కేసీఆర్ పాలనలోనే ముస్లింల సంక్షేమం

- ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌నే మళ్లీ గెలిపించాలి
- హోంమంత్రి మహమూద్ అలీ

హుస్నాబాద్‌రూరల్: సీఎం కేసీఆర్ పాలనలోనే ముస్లింల సంక్షేమం కొనసాగుతోందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. హుస్నాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి అభ్యర్థి సతీష్‌కుమార్‌తో కలిసి హాజరై మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అమలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ముస్లింల కోసం ఏమీ చేయలేదన్నారు. హుస్నాబాద్‌లో రూ.2 కోట్ల వ్యయంతో షాదీఖాన నిర్మించారని చెప్పారు. అభివృద్ధి కోసం తపించే నాయకుడినే మళ్లీ గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ మరోసారి అవకాశం కల్పిస్తే రెట్టింపు అభివృద్ధి చేసి హుస్నాబాద్‌ను ఆదర్శంగా నిలుపుతానన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సతీశ్‌ను మళ్లీ గెలిపించాలని కోరుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

నోటీసులతో అభ్యర్థుల్లో కదలిక

సిద్దిపేటజోన్: నోటీసులు అందుకున్న అభ్యర్థుల్లో కదలిక వచ్చింది. సిద్దిపేట అసెంబ్లీ పరిధిలో పోటీచేస్తున్న అభ్యర్థులు ఎన్నికల వ్యయానికి సంబంధించిన లెక్కలు చూపకపోవడంతో ఈనెల 18న వారికి నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వ్యయానికి సంబంధించిన వివరాలు అందచేశారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకుడు వేంకా దేశ్ బాబు, రిటర్నింగ్ అధికారి రమేష్ బాబు, సహాయ అధికారి దిలీప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులు, ఏజెంట్లతో సమావేశమైన వ్యయ పరిశీలకుడు

పార్టీల ఫ్లెక్సీలు, పోస్టర్లు ఉండొద్దు

- వంద మీటర్లలోపు ఏవీ లేకుండా చూడాలి
- జనరల్ అబ్జర్వర్ల ఆదేశాలు
- మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ

సిద్దిపేటరూరల్: ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల లోపు పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు లేకుండా చూడాలని అబ్జర్వర్లు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధ్యక్షతన రెండో స్థాయి మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ అందించారు. ఈ మేరకు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, హుస్నాబాద్, సిద్దిపేట నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ జయశ్రీ ఎస్.భోజ్, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ మన్మోహన్ ప్రసాద్, పోలీస్ అబ్జర్వర్ సోనం టెన్సింగ్ భూటీయాలు మాట్లాడుతూ సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని విధాల అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్, మైక్రో అబ్జర్వర్ నోడల్ అధికారి సత్యజిత్, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్, మైక్రో అబ్జర్వర్లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

సిద్దిపేటరూరల్: ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ గురువారం పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు తమ ఓటును ఇతర జిల్లాలోని నియోజకవర్గాల్లో కలిగి ఉంటే పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం దరఖాస్తు చేసుకొని వేయాల్సిందిగా సూచించారు. ఈనెల 24, 25వ తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

బీసీలకు రాజ్యాధికారం బీజేపీతోనే సాధ్యం

చేగుంట రోడ్‌షోలో పవన్ కల్యాణ్



మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్, చిత్రంలో రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): బీసీలకు రాజ్యాధికారం బీజేపీతోనే సాధ్యమని, అందుకే బీసీ ముఖ్యమంత్రి నినాదంతో బీజేపీ ముందుకు సాగుతోందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా గురువారం సాయంత్రం ఆయన చేగుంటలో రోడ్‌షో నిర్వహించారు. దుబ్బాక అభివృద్ధి కోసం వకీల్‌సాబ్ రఘునందన్‌రావు ఆరాటపడుతున్నారని ఆయనను గెలిపించాలని పవన్ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ ఎంపీగా గెలిచిన ప్రభాకర్‌రెడ్డి పదేళ్లుగా చేగుంటకు ఒక డిగ్రీ కళాశాల మంజూరు చేయించలేక పోయారని ఆరోపించారు. తనను గెలిపిస్తే గ్రామాలలోని సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, వైస్ ఎంపీపీ రాంచంద్రం, మాజీ ఎంపీపీ పాండు, సీనియర్ నాయకులు వెంగళరావు, గణేశ్ రవికుమార్, సంతోష్‌రెడ్డి, నర్సింలు, ఎన్.చారి, బాలచందర్, రఘువీర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయ వివరాల తనిఖీ

హుస్నాబాద్: రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హుస్నాబాద్, సిద్దిపేట వ్యయ పరిశీలకుడు డాక్టర్ వెంకటేశ్‌బాబు, రిటర్నింగ్ అధికారి బెన్ షాలోమ్ సమక్షంలో గురువారం రెండో విడత అభ్యర్థుల వ్యయ వివరాల పరిశీలించారు. ఎన్నికల బరిలో ఉన్న 19 మంది అభ్యర్థులు వారి వ్యయ వివరాలు సమర్పించారు. అందులో నేరారోపణ కలిగిన నలుగురు అభ్యర్థుల్లో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్, బీజేపీ అభ్యర్థి శ్రీరాంచక్రవర్తిలు మాత్రమే తమ నేరారోపణ సమర్పించినట్లు వ్యయ పరిశీలకుడు తెలిపారు. మిగిలిన ఇద్దరు బీఎస్పీ అభ్యర్థి శ్రీనివాస్, జేఎస్పీ అభ్యర్థి పరశురాములు నేరారోపణ సమర్పించలేదని తెలిపారు. ఈ నెల 28 లోగా సమర్పించాలని నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ సంజీవ్ కుమార్, ఏఈఓ సతీష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

సిద్దిపేటకమాన్: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా విధించిన ఘటన సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాజిత్‌పుర కాలనీకి చెందిన మహమ్మద్ జావిద్ ఖురేషి (38) పశువులను కొనుగోలు చేసి వాటి మాంసం విక్రయిస్తుండడంతో అతడిపై గతంలో కేసు నమోదైంది. ప్రస్తుతం ఎన్నికల నిబంధనలు అమల్లో ఉండడంతో అతడిని పోలీసులు బైండోవర్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించడంతో అతడిని స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా విచారణ జరిపి రూ.50వేల జరిమానా విధించారు.

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే..

- కేసీఆర్ కుటుంబమే బంగారమైంది
- మచ్చలేని మహనీయుడు ముత్యంరెడ్డి
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

దుబ్బాకటౌన్: 'బరాబర్ చెబుతున్నా వచ్చే నెల 9న రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడటం ఖాయం.. గడీల దొరల అరాచక పాలన అంతమవుతుంది.. ఇక ప్రజలు ఆత్మగౌరవంతో సంతోషంగా ఉంటారు' అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా పట్టణంలో జరిగిన బహిరంగ సభకు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ వచ్చాక కేసీఆర్ కుటుంబమే బంగారమైంది తప్పా ప్రజలు బాగుపడలేదన్నారు. తెలంగాణను బొందలగడ్డ గా మార్చారన్నారు. నాసిరకం ప్రాజెక్టులు నిర్మించి రూ.లక్ష కోట్లు దండుకున్నారని అన్నారు.

రఘునందన్‌రావును చిత్తుగా ఓడించాలి..

హామీలను విస్మరించిన రఘునందన్‌రావును చిత్తుగా ఓడించాలని రేవంత్‌రెడ్డి అన్నారు. దుబ్బాకకు పారిశ్రామిక వాడ తేలే.. ప్రత్యేక ప్యాకేజీ తేలేదని, ఇలాంటి వ్యక్తికి ఓటేయడం దండగ అన్నారు.

అభివృద్ధి చేసింది ముత్యంరెడ్డే..

మచ్చలేని మహనీయుడు స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి హయాంలోనే దుబ్బాక అభివృద్ధి చెందిందే తప్పా టీఆర్ఎస్ పాలనలో ఏమాత్రం జరగలేదన్నారు. దుబ్బాక నిధులన్నీ హరీశ్‌రావు సిద్దిపేటకు తరలించుకపోయి తీవ్ర అన్యాయం చేశాడన్నారు. ముత్యంరెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డిని గెలిపిస్తే దుబ్బాక రెవెన్యూ డివిజన్ తో పాటు పీజీ కళాశాలతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

మా నాన్నలా అవినీతిలేని పాలన చేస్తా..

మా నాన్న ముత్యంరెడ్డి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉంటే నేను ఎప్పుడూ రాజకీయాల్లో కలగజేసుకోలేదని, నేను అమెరికాలో ఉన్నానని, మా తల్లి పొలంకాడనే పనులు చేసుకుంటూ ఉండేవారని కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నన్ను గెలిపిస్తే అవినీతిలేని పాలన చేస్తానని అన్నారు.



పార్టీ నాయకులు అందజేసిన నాగలితో రేవంత్‌రెడ్డి, చిత్రంలో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



దుబ్బాకలో సభకు హాజరైన ప్రజలు, కార్యకర్తలు

క్లుప్తంగా

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న సీపీ శ్వేత

కొమురవెల్లి(సిద్దిపేట): ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సీపీ శ్వేత అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించి పలు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ నాగరాజు ఉన్నారు.

విధుల పట్ల అవగాహన ఉండాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎన్నికల విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీపీ శ్వేత అన్నారు. గురువారం ఆమె జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. బైండోవర్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్, ఎగ్జిక్యూటివ్, ప్రయివేట్‌గన్ డిపాజిట్ సీజ్ డబ్బు, ఫ్లాగ్ మార్చ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏసీపీ రమేష్, సీఐ జానకిరాం రెడ్డి, ఎస్‌ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

'చర్యలు తీసుకోండి'

సిద్దిపేటఅర్బన్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు గురువారం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల సమయంలో ఇలాంటి చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని, దుండగులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గంప మహేందర్ రావు, అత్తు ఇమాం, గయాజుద్దీన్ ఉన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి


నవ ధాన్యాలతో సత్యసాయి బాబా రూపం

గజ్వేల్‌రూరల్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలను గురువారం పట్టణంలోని సత్యసాయి మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అభిషేకాలను నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. పట్టణానికి చెందిన రామకోటి రామరాజు నవధాన్యాలతో 10 అడుగుల సత్యసాయి రూపాన్ని చిత్రించారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

సిద్దిపేటకమాన్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సిద్దిపేట వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. పోలీసుస్టేషన్ పరిధిలోని లింగారెడ్డిపల్లి, ఇమాంబాద్, ఇందిరమ్మకాలనీ గ్రామాల్లో ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, కేంద్ర బలగాలు, సిబ్బందితో కలిసి గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేలా ప్రశాంత వాతావరణం కల్పిస్తామని పేర్కొన్నారు.

ఉప్పొంగిన ఉత్సాహం

- పటాన్‌చెరు, జహీరాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభ
- కేసీఆర్ ప్రసంగంతో గులాబీ శ్రేణుల్లో జోష్

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ దూసుకుపోతోంది. సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా అలుపు లేకుండా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ప్రతిరోజూ రెండు మూడు సభల్లో పాల్గొంటూ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా గురువారం జహీరాబాద్, పటాన్‌చెరులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు. తన ప్రసంగంతో గులాబీ శ్రేణుల్లో జోష్ నింపారు. ఆయా సభలకు జనం భారీగా తరలివచ్చారు.


అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్


స్వాగతం పలుకుతున్న మహిపాల్‌రెడ్డి


పుష్పగుచ్ఛం అందిస్తున్న మాణిక్‌రావు


సభలో కేరింతలు కొడుతున్న కార్యకర్తలు


సీఎంతో హరీశ్ చర్చలు


మహిళా నాయకురాళ్లతో కేసీఆర్


సభకు తరలివస్తున్న ప్రజలు

అందుబాటులో ఉంటా.. ఆదరించండి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్

సంగారెడ్డి : స్థానికుడైన తాను గెలిచిన ఐదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ కోరారు. గురువారం చౌటకూర్ మండలంలోని కోర్పోలు, చౌటకూర్ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరోసారి అవకాశం కల్పిస్తే అందోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతానన్నారు. ఇప్పటికే రూ. కోట్లు వెచ్చించి గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించానన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయించి సీసీ రోడ్లు ఏర్పాటు చేయించానన్నారు. పుల్కల్, అందోల్ మండలాల్లోని చెరువు, కుంటలను సింగూరు జలాలతో నింపుతున్నామన్నారు. సింగూరు ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

చౌటకూర్, శివంపేట గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు క్రాంతికిరణ్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి సమక్షంలో బీఆర్‌ఎస్ చేరారు. ఈ సందర్భంగా చౌటకూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నసీర్‌అహ్మద్, కిష్టారెడ్డి, పల్లె జనార్దన్‌గౌడ్, గాజుల వీరేందర్, పల్లె సంజీవయ్య, సతీశ్ కుమార్, నర్సింహారెడ్డి, శివకుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

టేక్మాల్(మెదక్): టేక్మాల్, బర్దిపూర్ గ్రామాల్లో అందోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చింత స్వప్నరవి, సుప్రజ, వరలక్ష్మి పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న నాయకులు


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో క్రాంతికిరణ్

కాంగ్రెస్‌కు ఓటేస్తే దళారుల రాజ్యమే

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్‌కు ఓటేస్తే దళారుల రాజ్యం వస్తుందని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలం ముద్దాపూర్, మంగోల్, లకుడారం, బొబ్బాయిపల్లి, చిన్న కిష్టాపూర్, రాయవరం గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి గురువారం రోడ్ షోలను నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పేదల భూములు ఆగం చేసేందుకు కాంగ్రెస్ ధరణి పోర్టల్‌ను తీసేస్తామంటుందన్నారు. కాంగ్రెస్‌వి గ్యారంటీ లేని ఆరు పథకాలని, ఇంజన్ సరిగా లేని డబుల్ ఇంజన్ సర్కార్ నాయకులు కొత్త బిచ్చగాళ్ల మాదిరిగా గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోమారు అధికారంలోకి రాగానే సౌభాగ్యలక్ష్మి పథకం పేరిట ప్రతీ మహిళకు నెలకు రూ.3వేల చొప్పున పెన్షన్ అందిస్తుందన్నారు. భూమి లేకున్నా ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల బీమా పథకాన్ని సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో పెట్టారన్నారు. ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్, మహిపాల్, కిరణ్‌కుమార్‌చారి, కనకవ్వ, కనకయ్య, పావని, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మన్‌రాజు, సంతోష్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఢిల్లీ పార్టీలు వద్దు.. బీఆర్‌ఎస్సే ముద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఢిల్లీ పార్టీలకు ఓటేస్తే తెలంగాణకు మళ్లీ కరువు వస్తుందని, కేసీఆర్ ప్రభుత్వంతోనే అభివృద్ధి జరుగుతుందని ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఉమ్మడి జగదేవ్‌పూర్ మండలం చిన్నకిష్టాపూర్, రాయవరం, పీటివెంకటాపూర్; ఎల్లాయిగూడ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొండపోచమ్మ డైరెక్టర్ లక్ష్మణ్‌రాజ్, మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్‌లు కనకయ్య, రాములు, పావని, కల్పన పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు కేసీఆర్ అండ

గజ్వేల్ : భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమ్మేళనానికి వారు హాజరై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఊడెం క్రిష్టారెడ్డి, గాలెంక నర్సింలు తదితరులు పాల్గొన్నారు. కాగా భవన నిర్మాణ కార్మికులు కేసీఆర్‌కు మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం అందజేశారు.

మహిమాన్వితం.. శక్తిపీఠ క్షేత్రం

కొండపాకలో ప్రారంభానికి ముస్తాబైన ఉమా రామలింగేశ్వర ఆలయం

కొండపాక(గజ్వేల్): దేశంలోనే మొదటి సారిగా సిద్దిపేట జిల్లా కొండపాక గ్రామ శివారులోని ఆనంద నిలయం ఆవరణలో నిర్మించిన అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం ప్రారంభానికి సిద్ధమైంది. ఈనెల 25, 26, 27 తేదీల్లో పుష్పగిరి పీఠాధిపతులు విద్యాశంకర భారతీ స్వామి, గురుమదనానంద సరస్వతీ పీఠాధిపతులు మధవానంద సరస్వతీ స్వామీల చేతుల మీదుగా ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శక్తివంతమైన 18 దేవతలు ఒకేచోట కొలువుదీరేలా వేర్వేరుగా గదులను నిర్మించారు. దీంతో దేవాలయం గొప్ప మహిమాన్విత శక్తిపీఠ క్షేత్రంగా మారుతుంది. దేవాలయాన్ని ఆగమశాస్త్ర విధానంలో వాస్తు రీత్యా శిల్పసంపదతో నిర్మించారు. మూడురోజుల పాటు పూజా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా 27న తెల్లవారుజామున 5.11 నిమిషాలకు తులా లగ్న పుష్కరాంశ సుముహూర్తమున యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తారు.

18 శక్తి పీఠాలు..

జోగులాంబాదేవి, భ్రమరాంబదేవి, మహాలక్ష్మి, ఏకవీరాదేవి, మహాకాళీదేవి, చాముండేశ్వరీ దేవి, శృంఖలాదేవి, కామాక్షి దేవి, శాంకరీ దేవి, పురుహూతికా దేవి, గిరిజా దేవి, మాణిక్యాంబా దేవి, కామరైపీ దేవి, మాధవేశ్వరీ దేవి, వైష్ణవీ దేవి, మంగళగౌరీ దేవి, విశాలక్షీ దేవి, సరస్వతీ దేవీ శక్తి పీఠాలు వేర్వేరుగా ప్రతిష్ఠించేందుకు గదులు నిర్మించారు. ఆలయంలో అన్ని దేవాలయాల దర్శనాలు చేసుకునే సౌకర్యాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ మహా పుణ్య కార్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అష్టాదశ శక్తిపీఠ సహిత రామలింగేశ్వర స్వామీ చారిటబుల్ ట్రస్టు కోరింది.


కొండపాకలోని ఉమారామలింగేశ్వర స్వామి దేవాలయం

కేసీఆర్‌ను ఆశీర్వదించండి

కొండపాక(గజ్వేల్): నీటి గోస తీర్చిన సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొండపాక, మధిర వడ్డెర కాలనీ, డబుల్ బెడ్రూం కాలనీలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో బిందెడు నీటి కోసం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి తీవ్ర ఇబ్బంది పడ్డారన్నారు. ప్రతిపక్షాలు ఆచరణకు సాధ్యం కానీ హామీలిస్తూ మోసం చేయాలని చూస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధురీరెడ్డి, ఎంపీటీసీలు అనసూయ, లక్ష్మి, నాయకులు అనంతుల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల మద్దతు..

వర్గల్(గజ్వేల్)/గజ్వేల్‌రూరల్: సీఎం కేసీఆర్‌కు అన్నివర్గాల ప్రజలు మద్దతు ప్రకటిస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని గిర్మాపూర్, గుంటిపల్లిలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. సమావేశంలో బాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్‌లో ఎంపీపీ దాసరి అమరావతి శ్యాంమనోహర్ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బాపురెడ్డి, కృష్ణాగౌడ్, బాలమణి, నర్సింలు, బురాన్, రవీందర్‌గౌడ్ ఉన్నారు.


కొండపాకలో ప్రచారం నిర్వహిస్తున్న చిట్టి దేవేందర్‌రెడ్డి

దర్జాగా కారుకు ఓటెయ్యండి..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మంత్రి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు పిలుపునిచ్చారు. ఆయన గురువారం పట్టణంలోని 19వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓ టైలర్ షాపులో బట్టలు కుడుతూ కారు గుర్తుకే ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ అరవింద్, రఘునందన్‌రావు


దౌల్తాబాద్‌లో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్న జనం

కుటుంబ పాలనను సాగనంపాలి

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్

దౌల్తాబాద్(దుబ్బాక): తెలంగాణ ప్రజలను నమ్మించి లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్ కుటుంబానికి ఓటుతో బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పిలుపునిచ్చారు. గురువారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ వాళ్లను లుచ్చాగాళ్లు అని మాట్లాడారు... మరి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిన కేసీఆర్, కేటీఆర్ లుచ్చాగాళ్లు కాదా అని ప్రశ్నించారు. జాగ్రత్తగా మాట్లాడకపోతే త్వరలో మీ బట్టలిప్పే రోజులు వస్తుందన్నారు. కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దోచుకున్న కేసీఆర్ బిడ్డ కవిత.. ఢిల్లీలో లిక్కర్ల దందా పెట్టుకుందన్నారు. బీఆర్‌ఎస్ మోసాలను ప్రజలు నమ్మకుండా ఓటుతోనే గుణ పాఠం చెప్పాలన్నారు.

తగిన జవాబు చెప్పడానికే వచ్చారు...

కేటీఆర్, కేసీఆర్‌కు అర్థమయ్యేలా జవాబు చెప్పడానికే నిజామాబాద్ నుంచి ధర్మపురి అరవింద్ అన్న ఇక్కడికి వచ్చారని రఘునందన్‌రావు తెలిపారు. కరోనా కాలంలో 6 కిలోల బియ్యం, టీకాలు అందించిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. కిషన్, కుమ్మరి నర్సింహులు, భైపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, సర్పంచ్‌లు లావణ్య నర్సింహారెడ్డి, కనకయ్య, ప్రసాద్‌రావు, స్వామి, గణేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు

- నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా
- కేసీఆర్‌తోనే అన్నిరంగాల అభివృద్ధి
- కాంగ్రెస్ హామీలను నమ్మొద్దు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని ఆ పార్టీ అభ్యర్థి భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలాపల్లి, మాడ్చెట్‌పల్లి, బూర్గుపల్లి, కోళపల్లి, కట్టెల వెంకటాపూర్ తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరవై ఏళ్లలో జరగని అభివృద్ధి సీఎం కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లలోనే జరిగిందన్నారు. ప్రజలకు మరింత సేవ చేసేందుకు బీఆర్‌ఎస్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళి, మాజీ ఎంపీటీసీ వేణుగోపాల్‌గౌడ్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, రైతుబంధు అధ్యక్షుడు సురేష్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కల్హేర్: మీర్ఖాన్‌పేటలో భూపాల్‌రెడ్డి బ్రదర్స్‌కు గొర్రెపిల్లలను బహూకరిస్తున్న నాయకులు

మరోసారి గెలిపించండి

కల్హేర్(నారాయణఖేడ్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి మరోసారి గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి భూపాల్ రెడ్డి ఓటర్లను కోరారు. మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డితో కలిసి మండల పరిధిలోని మీర్ఖాన్‌పేట, నిజాంపేట మండలం నాగధర్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరన్నారు. భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆత్మచైర్మన్ రాంసింగ్, ఎంపీపీ గుర్రపు సుశీలఅంజయ్య, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ పద్మబాపురాజ్, సర్పంచ్‌లు రవిల, శ్రావణ్‌కుమార్, నాయకులు గుర్రపు జలంధర్, వెంకటేశంసేట్, యకోబ్ పాల్గొన్నారు.

వర్షం..ఆటంకం

వర్గల్ గురుకులంలో రెండోరోజుకు చేరిన రాష్ట్ర పోటీలు

వర్గల్(గజ్వేల్): సిద్దిపేట జిల్లా వర్గల్ పూలే గురుకులంలో రాష్ట్ర బాలికల ఆటల పోటీలకు వర్షం ఆటంకంగా నిలిచింది. గురువారం రెండోరోజు మార్నింగ్ సెషన్‌కే పోటీలు పరిమితమయ్యాయి. తొలిసెషన్‌లో అండర్-17, అండర్-19, డిగ్రీ క్రీడాకారులకు 3000 మీటర్లు, 1500 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర 11 దాకా పోటీలు జరిగాయి. ఇందులో ఆతిథ్య గురుకుల క్రీడాకారులతో కూడిన మెదక్‌జిల్లా ఆధిక్యత ప్రదర్శించింది.

రెండోరోజు విజేతలు వీరే

అండర్-19 ఖోఖో పోటీలో మెదక్ విజయం సాధించింది. అండర్-19 కబడ్డీలో నల్గొండ, అండర్-17 వాలీబాల్ పోటీలో నిజామాబాద్ విజేతలుగా నిలిచాయి. 3000 మీటర్ల పరుగు పోటీలో మూడు విభాగాల్లోనూ (అండర్-17, అండర్-19, డిగ్రీ) మెదక్ క్రీడాకారులు సత్తాచాటి విజేతలుగా నిలిచారు. 1500 మీటర్ల పరుగు అండర్-17లో మహబూబ్‌నగర్, అండర్-19లో మెదక్, డిగ్రీలో మెదక్ క్రీడాకారులు విజయం సాధించారు. లాంగ్‌జంప్ అండర్-17లో మహబూబ్‌నగర్, అండర్-19లో మెదక్ క్రీడాకారులు ప్రథమస్థానం సాధించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 30పైగా పోటీలు నిర్వహించాల్సి ఉండగా.. వాన కారణంగా కేవలం 11 మాత్రమే జరిగాయి. ఇండోర్ గేమ్ క్యారం పోటీలు మాత్రం కొనసాగాయి.


మెదక్-నల్లగొండ జట్ల మధ్య కబడ్డీ పోటీ